క్లుప్తంగా

స్వర్ణ ప్రాశం పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు వేద ఆయుర్వేదిక్ పంచ కర్మ, వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం 0–16 సంవత్సరాల చిన్నారులకు స్వర్ణ ప్రాశాన్ని ఉచితంగా వేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 126 మంది పిల్లలకు స్వర్ణ ప్రాశం వేసిన తర్వాత మాట్లాడారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా పెంబర్తి మాజీ సర్పంచ్‌రామ చంద్రం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'కడియం' గెలుపు ఖాయం



స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణ ఎన్నికల్లో ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చేపూరి వినోద్ అన్నారు. డివిజన్ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులంతా కడియం శ్రీహరి వెంటే ఉన్నారని, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గతంలో కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి కార్యక్రమాలే కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, రాపోలు మధుసూధన్‌రెడ్డి, పోగుల సారంగ పాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మాదాసు వెంకటేష్



స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల బీజేపీకి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేసిన మాదాసు వెంకటేష్ శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఘన్‌పూర్ నియోజవకర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకటేష్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.

నీటితో నిండిన వరి పొలం



చిల్పూరు: మరో రెండు రోజుల్లో వరి కోసేందుకు రైతులు మిషన్లకు అడ్వాన్స్ చెల్లించారు. కోసిన వరి ధాన్యం ఆరబోసుకునేందు కల్లంలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కొందరు గుర్తు తెలియని రైతులు పత్తి పంటకు నీరు పెట్టేందుకు దేవాదుల రిజర్వాయర్ పైపులైన్ గేట్ వాల్వ్ లీక్ చేయడంతో నీరు ఎక్కువై 20 ఎకరాల్లో కోతకు వచ్చిన వరిపంటల్లోకి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన బాధిత రైతులు సాదం గట్టయ్య, అంజయ్య, మహేందర్, కన్నయ్య తదితర రైతులు మాట్లాడారు. బొంతగట్టు వర్రె, మూడుకొల్ల వర్రెల సమీపంలో ఎక్కువగా పత్తి పంట వేసుకున్నారు. పంటకు నీరు పెట్టేందుకు గేట్ వాల్వులు లీక్ చేసి మళ్లీ బిగించక పోవడంతో నీరు వరి పొలాల్లోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు నష్టమయ్యేలా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కుట్ర పూరితంగా కేసు

రఘునాథపల్లి: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటే కొందరు గిట్టని వారు కుట్రపూరితంగా గిరిజనుడితో కేసు పెట్టించారని సర్పంచ్ పోకల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో గిరిజనుడి స్థలానికి దూరంగా నాలుగేళ్లగా జీపీ పర్యవేక్షణలో బతుకమ్మల నిమజ్జనం కోసం గోతులు తీసి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆనవాయితీగా ఉత్సవాలు ముగిశాక గోతులు పూడ్చివేస్తున్నామన్నారు. ఆ స్థలాన్ని తాను అక్రమించుకునేందుకు యత్నిస్తున్నానని ఆరోపణలు చేయడంలో నిజం లేదన్నారు.

వర్గీకరణతోనే ఎస్సీల అభ్యున్నతి

దేవరుప్పుల: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణతోనే ఆర్థిక అసమానతలు తొలగి అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో హైదరాబాద్‌లో ఈనెల 11న తలపెట్టిన విశ్వరూప మహాసభను వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

'పల్లా' తరఫున సతీమణి ప్రచారం



26వ వార్డులో ఇంటింటా పర్యటిస్తున్న నీలిమ, బీఆర్‌ఎస్ నాయకులు

- నీలిమకు అపూర్వ స్వాగతం
- కాలనీవాసులతో మమేకం
- కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం కోసం ఆయన సతీమణి నీలిమ శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. జనగామ పట్టణ పరిధి 26, 27, 22 వార్డుల్లో రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రతీ ఓటరును పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జనగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు రాజేశ్వర్‌రెడ్డికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహిళలు నీలిమకు బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ఆయా వార్డుల్లో వృద్ధులను ఆత్మీయంగా పలుకరిస్తూ, యువతకు దిశానిర్దేశం చేస్తూ మనందరి భవిష్యత్ కోసం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పాటు కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీ మనందరికీ దక్కాలంటే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు ఇలా ఏ రాష్ట్రం అమలు చేయని కార్యక్రమాలతో ప్రతి గడపకు సర్కారు స్కీంలు అందిస్తున్న ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, వెన్నెం సత్యనిరంజన్‌రెడ్డి, కావ్య, ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. 13వ వార్డులో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శంకర్, పులిసాయి, పానుగంటి ప్రవీణ్, బబ్లూ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధి ఎనిమిది మండలాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది.

తరిగొప్పులలో ప్రచారం..

తరిగొప్పుల: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ నాగారం, సోలిపూర్, బొత్తలపర్రె గ్రామాల్లో ప్రచారం నిర్వహించి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జొన్నగోని సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, దామెర ప్రభుదాస్, చిలువేరు లింగం, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అమిరిశెట్టి వీరేందర్, సాయిల్ల రాజు, బూస యాదగిరి, మల్యాల సుధీర్, భూక్య రవి పాల్గొన్నారు.



నేత కార్మికుడిని ఓటు అడుగుతున్న నీలిమ



వృద్ధురాలితో మాట్లాడుతున్న నీలిమ

ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు

- జనగామ పార్టీ అభ్యర్థి 'కొమ్మూరి'

జనగామ/బచ్చన్నపేట: ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారు.. స్థానికుడినైన తనను ఆదరించి గెలిపిస్తే నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నర్మెట మండలం మచ్చుపహాడ్, ఇతర గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు యూత్ కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం బచ్చన్నపేట మండలం కట్కూర్, వీఎస్‌ఆర్ నగర్, గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, గోపాల్‌నగర్, తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో గడప గడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. జనగామ, పాత చేర్యాల నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కరువుతో అల్లాడిపోతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి దేవాదుల నీరు వచ్చేలా కృషి చేశానన్నారు. ఆ నీటితోనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అయిందని, అన్నదాతల కష్టాలు తీరినాయని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నదాతలకు ఇంత వరకు పంట రుణమాఫీ చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరు క్షణమే మొదటి సంతకాన్ని రెండు లక్షల రుణమాఫీపై పెడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు.

కాంగ్రెస్‌లో చేరిక

నర్మెట: కాంగ్రెస్ హయాంలోనే దేశం అభివృద్ధికి నోచుకుందని అసెంబ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధికి నోచుకుంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి అన్నారు. మచ్చుపహాడ్, ఆగాపేటలకు చెందిన పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి స్వాగతం పలుకుతున్న కొమ్మూరి

కాంగ్రెస్‌లోకి పలువురు

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీల నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులను తీసుకెళ్లి పార్టీలో చేర్పించారు.

గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జనగామ రూరల్: గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని మాజీ ఎంపీపీ ధర్మ గోవర్ధన్, జిల్లా నాయకుడు కొత్త కర్ణాకర్ అన్నారు. ఎర్రకుంటతండా, కల్యాణ్‌నగర్‌లో కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈసందర్భంగా కొమ్మూరి గెలుపునకు కృషి చేయాలని అన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో మండలంలోని పలు తండాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తెలియజేస్తూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వగలబోయిన యాదగిరి, ముడావత్ సంపత్‌నాయక్, లుకా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు



మాట్లాడుతున్న కాంగ్రెస్ లీగ్ సెల్ ప్రతినిధులు

జనగామ: జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అభ్యర్థులకు పార్టీ జిల్లా లీగల్ సెల్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని లీగల్ సెల్ చైర్మన్ గంగు నాగరాజశర్మ, కన్వీనర్ ఆలేటి సిద్ధిరాములు, కోకన్వీనర్ చింతపండు భిక్షపతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన లీగ్ సెల్ సమావేశంలో వారు మాట్లాడుతూ అభ్యర్థులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సింగపురం ఇందిర, హనుమాండ్ల యశస్వినీరెడ్డి గెలుపుకు కృషి చేయాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. కరెడ్ల రవీందర్ రెడ్డి, కె.మల్లయ్య, జమాల్ షరీఫ్, పరశురాములు, చాట్ల నర్సింగరావు, బొట్ల వినోద్, పెండ్లి అశోక్‌రెడ్డి, నక్క సిద్దులు, సంపత్, సురేష్, చంద్రశేఖర్, జహంగీర్, రవీందర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా వార కల్యాణం

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హనుమకొండకు చెందిన బొద్దిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి–మౌనిక, ప్రకాష్‌రెడ్డి–రమాదేవి దంపతులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

అఖిల్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

దేవరుప్పుల: సీతారాంపురానికి చెందిన అఖిల్ అనే యువకుడు మృతి చెందాడు. కాగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు గ్రామానికి చేరుకొని అంత్యక్రియల్లో పాల్గొన్ని బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. నిండు జీవితాన్ని కోల్పోయిన యువకుడి కుటుంబానికి పార్టీ పరంగా ఆదుకుంటామన్నారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి

జనగామ బీజేపీ అభ్యర్థి దశమంతరెడ్డి

జనగామ రూరల్: పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.జిల్లా ఉద్యమంలో పోరాడిన తనను గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేఈవీఎల్ఎన్‌రెడ్డి, రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ సీతయ్య, మండల అధ్యక్షుడు తిరుపతి,శివరాజ్ ఉన్నారు.



చీటకోడూర్ కల్వర్టును పరిశీలిస్తున్న దశమంత్‌రెడ్డి

కుక్కలతో ప్రజల బెంబేలు

రెండు రోజుల్లో 17 మందికి కుక్కకాటు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. శుక్ర, శనివారాల్లో ఘన్‌పూర్‌లో 17 మంది కుక్కకాటు గురయ్యారు. శుక్రవారం ఘన్‌పూర్‌లో 6గురు కుక్కకాటుకు గురికాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కాగా, శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకంగా 11 మందికి పిచ్చికుక్కల కాటుకు గురయ్యారు. ఘన్‌పూర్‌కు చెందిన ఏదునూరి యాదగిరి తన మనువడైన రియాన్‌తేజ్(6)ను పాఠశాల బస్సు ఎక్కించేందుకు వెళ్లగా వీధి కుక్క దాడిలో ఇద్దరు గాయపడ్డారు. అదేవిధంగా శివునిపల్లికి చెందిన బండారి వర్షిత్ (9) పాఠశాలకు వెళ్తుండగా కుక్క కాటుకు గురయ్యాడు. దాంతో బాధితులు ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆస్పత్రికి రాగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. పేరుకే పెద్దాసుపత్రి అని, వైద్యులు అందుబాటులో లేకపోవడం బాధాకరమని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరికి ఉదయం 10 గంటల తర్వాత డాక్టర్ రావడంతో వారికి చికిత్స చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన లక్ష్మీప్రసన్న అనే రెండున్నరేళ్ల చిన్నారిని, కె.శ్రీనివాస్ అనే యువకుడిని వీధి కుక్క కరిచింది. కుక్కకాటుకు గురైన బాధితుల్లో ఆరాధ్య(6), భూక్య లచ్చీరామ్(60), పారునంది అనురాధ(40), కె.రాజు, కె.ప్రణయ్ తదితరులున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల బెడద నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





కుక్కకాటుకు గాయపడ్డ చిన్నారులు రియాన్‌తేజ్, బండారి వర్షిత్

కుక్కను చంపిన ప్రజలు

వీధికుక్కలు ప్రజలపై దాడి చేస్తున్న విషయమై ఆగ్రహం వ్యక్తం చేసిన వారు సాయంత్రం ఓ వీధికుక్కను రాళ్లతో కొట్టిచంపారు. కుక్కలను ఇక్కడ నుంచి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసీఆర్ చరిత్ర సృష్టించబోతున్నారు

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

జనగామ: సీఎం కేసీఆర్ మూడో సారి సీఎంగా గెలుపొంది కొత్త చరిత్రకు నాంది పలుకబోతున్నారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలనే దృఢ సంకల్పం కలిగిన కేసీఆర్‌తో బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ఆ భావనతో పార్టీ మారిన తనను జనగామ ప్రజలు స్వీకరిస్తారనే నమ్మకం ఉందన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం పొన్నాల ఎప్పుడూ అండగా ఉంటాడని చెప్పారు. రాష్ట్రంలో అనేక పార్టీలు బీసీల మనసు గెలుచుకుంటుంటే.. కాంగ్రెస్ ఎందుకు ఆలోచన చేయలేక పోతున్నదని ప్రశ్నించారు. డబ్బులతో దొంగ సర్వేల చేయిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సిద్ధాంతాలను నమ్మి మాత్రమే బీఆర్‌ఎస్‌లో చేరాను తప్ప పదవులను ఆశించి కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని బాగు చేయాలనే పట్టుదల, చిత్తశుద్ధి కేసీఆర్‌లో ఉందన్నారు. సమావేశంలో నాయకులు బండ యాదగిరిరెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, ఖాజా ఆరిఫ్‌ఉద్దీన్, జంగిటి అంజయ్య, గురువయ్య గౌడ్, ఎండీ మాజీద్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఎండీ.షకీల్, ఎండీ.సలీం, కూరపాటి మధు, సొడ మహేష్, జీజీ రెడ్డి, జహంగీర్, ఫయాజ్, పిట్టల రాజేష్, అజామ్, కొండా కిరణ్, మహేశ్వరం శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

బీఆర్‌ఎస్ హామీలతో మోసపోవద్దు

- కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : బీఆర్‌ఎస్ హామీలతో మరోసారి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి సింగరాజుపల్లి, బంజర, చిన్నమడూరు గ్రామాల్లో 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కారు అన్ని కులాలను మోసం చేసిందని, మంత్రి దయాకర్ రావు హయాంలో విద్య, వైద్యం అభివృద్ధి శూన్యమన్నారు. పదేళ్లలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు తీసుకురాలేక పోయారని, పేదలకు ఇళ్లు, రైతులకు సరిగా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల అమలు ఖాయమని, హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి ప్రసంగించారు. సింగరాజుపల్లి, బంజరలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు పెద్ది కృష్ణమూర్తి, తార, బాగాల మాలతి, సజ్జన్,గణేష్, కొండ మల్లారెడ్డి, రామచందర్ నాయక్, వంగ దశరథ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న యశస్వినిరెడ్డి

సొంత గూటికి బక్క నాగరాజు!

ప్రగతి భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేరిక

జనగామ: తెలంగాణ ఉద్యమ నేత, బీజేపీ నాయకుడు బక్క నాగరాజు శనివారం సొంత గూటికి చేరారు. శనివారం ప్రగతి భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో నాగరాజు గులాబీ కండువా కప్పుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనే మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌కు చెందిన బక్క నాగరాజు గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో కీలకంగా వ్యవహరించారు. సీపీఎంలో ముఖ్యభూమిక పోషించిన ఆయన.. బీఆర్‌ఎస్ ఆవిర్భావ సమయంలో కేసీఆర్ వెంట నడిచారు. పార్టీ జనగామ నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేసిన ఆయనను కేసీఆర్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రమోట్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత మొదటి సారిగా 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరి రాష్ట్ర అధికారి ప్రతినిధిగా సేవ లందించారు. కాంగ్రెస్ ఓటమి తర్వాత మూడేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉన్న నాగరాజు గత ఏడాది బీజేపీలో చేరారు. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో నాగరాజును బీఆర్‌ఎస్ అధిష్టానం ఆహ్వానించగా జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.



భయపెట్టి పార్టీలో చేర్చుకుంటున్నారు

- కాంగ్రెస్ ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

లింగాలఘణపురం: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టి బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. శనివారం మండల పరిధి కుందారం, చీటూరు, వనపర్తి, కొత్తపల్లి గ్రామాల్లో కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. నెల్లుట్ల వార్డు సభ్యులు గడ్డం యాకమ్మయాదగిరి, ధీకొండ రాజు, శ్రవంతిభాస్కర్, కుందారం, చీటూరు, వనపర్తి, కొత్తపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిర మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అర్ధరాత్రి ఇంటి నుంచి తీసుకువెళ్లి.. ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయించి తెల్లారే సరికి తమ పార్టీలో చేరారంటూ పోస్టులు పెట్టుకోవడాన్ని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే అంబేడ్కర్ సాక్షిగా పార్టీలో చేర్పించుకోవాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు త్వరలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అధికారంలోనికి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సుగుణ, మల్లేశం, ఎంపీటీసీ రజితఉపేందర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, బిట్ల బాబు, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగపురం ఇందిర

సంక్షిప్తంగా

కొమ్మూరిని కలిసిన మండల నాయకులు

రఘునాథపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని శనివారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇబ్రహీంపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, మేడిపల్లి సరేష్, చింత నరేష్, మధు, రాజు, రమేష్ ఉన్నారు.

నియంతృత్వ పాలనకు చరమగీతం ఖాయం

కొడకండ్ల: రాష్ట్రంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎడునూతుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దొంగరి హరిషన్, మాజీ జెడ్పీటీసీ సుజాత బీఆర్‌ఎస్‌కు స్వస్తి పలికి కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి: దర్దేపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో శనివారం చేరారు. దర్దేపల్లికి చెందిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కారుపోతుల కుమార్, గ్రామ అధ్యక్షులు దండయ్య ఆధ్వర్యంలో చిలువేరు కృష్ణ, కొనకటి రాజు, జలగం హరీశ్‌లతో పాటు 20 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఝాన్సీరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతా..

చిల్పూరు: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమని తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని పార్టీ జిల్లా నాయకుడు మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారాన్ని ఖండించారు.

'స్టేషన్'లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

రఘునాథపల్లి: ఈఎన్నికల్లో స్టేషన్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాపోలు రామ్మూర్తి అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అవగాహన

జఫర్‌గఢ్ : తమ్మడపల్లి జి, వడ్డెగూడెం, జఫర్‌ఘఢ్, గ్రామాల్లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో బూత్ స్థాయి కార్యకర్తలకు అయాగ్రామాల్లో ఓటర్ల జాబితా నిర్వహణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల ఇన్‌చార్జ్ బుర్ర తిరుపతి అన్నారు.

వాహన తనిఖీ

కొడకండ్ల: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సందర్భంగా మొండ్రాయి రెవెన్యూ పరిధి గిర్నితండా రాణు నాయక్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద పాలకుర్తి ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: విద్యార్థులకు కుట్టించి అందించే ఉచిత దుస్తుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్న విద్యాశాఖాధికారిపై చర్య తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఇప్ప రాంరెడ్డి, దివాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

సంతాపం

తరిగొప్పుల: మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రం కనకరాజు (45)మృతిచెందాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఎస్ఎస్‌జే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, ఇంచార్జ్ ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి జూనియర్ అసిస్టెంట్లు యాదగిరి, ఆంజనేయులు తదితరులు మృతదేహానికి నివాళులర్పించి దహన సంస్కారాల నిమిత్తం రూ.20వేలు అందజేశారు.

బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం

పాలకుర్తి: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు గ్రామాల్లో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

కడియం గెలుపునకు..

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలునకు వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రాపోలు మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిట్టెగూడెంలో ప్రచారం చేశారు.

కడియం శ్రీహరికే మద్దతు

జఫర్‌గఢ్/చిల్పూరు: బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదెపాక నాగరాజు తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం మద్దతు ప్రకటించారు. తాటికాయల చిరంజీవి, పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీ సంపత్, ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూజ నిర్వహించారు. వేడుకలకు హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బైక్ దొంగ అరెస్ట్

జనగామ రూరల్: మద్యానికి అలవాటు పడి జనగామలో బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని శనివారం జనగామ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. గుండాల మండలం మరిపడిగా గ్రామానికికు చెందిన రుద్రోజు శివ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి అలవాటు పడడంతో లారీ ఓనర్ డ్రైవింగ్ నుంచి తొలగించాడు. దీంతో మత్తుపదార్థాలకు అలవాటుపడి డబ్బుల కోసం బైక్ దొంగతనం చేయగా హైదరాబాద్ నుంచి జనగామకు వస్తుండగా పోలీసులు లైసెన్స్, ఆర్సీ అడగడంతో తప్పించుకుంటుంగా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.